

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి



ప్రజాశక్తి - ఏలూరు

ఈనెల 16వ తేదీ సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పోలవరం పర్యటన సందర్భంగా జిల్లా అధికారులందరూ హాజరు కావల్సి ఉన్నందున ఈనెల 16న నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు తెలిపారు.

ఉద్యమాలే ఊపిరిగా..
ప్రజాక్షేత్రంలో ముమ్మందుకు

- సిపిఎం జిల్లా మహాసభ పిలుపు
- విద్యుత్ భారాలపై దశలవారీ ఆందోళనలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం
- ముగిసిన సిపిఎం ఏలూరు జిల్లా మహాసభ
- జిల్లా కార్యదర్శిగా ఎ.రవి మరోసారి ఎన్నిక

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రజాక్షేత్రంలో ఉద్యమాలే ఊపిరిగా ముమ్మందుకు సాగాలని సిపిఎం జిల్లా మహాసభ పిలుపునిచ్చింది. జిల్లా సమగ్రాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలతో మరింత మమేకమై పోరాటాలు సాగించాలని నిర్ణయించింది. మూడు రోజులపాటు స్థానికంగా ఆర్.సత్యనారాయణ (ఆర్ఎస్) స్మారక ప్రాంగణంలో జరిగిన సిపిఎం జిల్లా 26వ మహాసభ ఆదివారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిసింది. తొలిరోజు శుక్రవారం భారీ ప్రదర్శన, బహిరంగ సభతో మహాసభ ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆపై శని, ఆదివారాల్లో ప్రతినిధుల సభ సాగింది. పతాకావిష్కరణతో ప్రారంభమైన ప్రతినిధుల సభ నిర్వహణకు వివిధ కమిటీలను ఎన్నుకోవడంతోపాటు ఈ కాలంలో మరణించిన నేతలకు, కార్యకర్తలకు ఘనంగా నివాళులర్పించింది. అనంతరం తెల్లం రామకృష్ణ, డివిఎన్‌విడి ప్రసాద్, కె.శ్రీనివాస్, ఎం.జీవరత్నం, ఎన్.పద్మాంజలి అధ్యక్షవర్గంగా మహాసభను ముందుకు నడిపించారు. ప్రారంభోపన్యాసం వి.ఉమామహేశ్వరరావు చేశారు. అంతర్జాతీయ, జాతీయ పరిణామాలను వివరించారు. దేశంలో, రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న భారాలు, చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణ గురించి దిశానిర్దేశం చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎ.రవి కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెట్టగా వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రతినిధులు, ఆయా రంగాల ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. అనంతరం మహాసభ ఆ నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించింది. జిల్లాలో ఏజెన్సీలో భూ సమస్యలు, నిర్వాసితుల అవస్థలు, ఎర్రకాల్వ మిగులు భూముల పోరాటం, చింతలపూడి ఎత్తిపోతల భూనిర్వాసితులు, దోసపాడు అసైన్డ్ భూములు, వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల స్థితిగతులు, అసంఘటిత రంగ కార్మికులు, ఉపాధి హామీ కార్మికులు, మహిళలు, యువత, విద్యార్థులు, మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై మహాసభ చర్చించి పలు తీర్మానాలు ఆమోదించింది. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా దశలవారీగా ఆందోళనలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపర్చేలా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజలతో మరింత మమేకమై స్థానిక సమస్యలు పరిష్కారమయ్యే వరకూ వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టాలని సూచించారు. ప్రత్యేక హోదా, పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం, విశాఖ రైల్వేజోన్ వంటివి కేంద్రం చేతిలోనే ఉన్నా పట్టించుకోకపోవడాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జిల్లా మహాసభ తీర్మానాల అమలుకు పోరాటాలు ఉధృతంగా సాగించాలని, నిరంతరం ప్రజల వెన్నంటి ఉండాలని సూచించారు. ఆహ్వాన సంఘం కార్యదర్శి ఏర్పాట్లను వివరించి, వలంటీర్లను పరిచయం చేశారు. అనంతరం నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది.



సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం



ముగింపు సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు

సిపిఎం నూతన జిల్లా కమిటీ ఇదే..

సిపిఎం జిల్లా కార్యదర్శిగా ఎ.రవి మరోసారి ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా డివిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, జి.రాజు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా గుడిపాటి నరసింహారావు, తెల్లం దుర్గారావు, వై.నాగేంద్రరావు, ఎ.ఫ్రాన్సిస్, ఎం.జీవరత్నం, పి.మంగరాజు, గుడెల్లి వెంకట్రావు, తామా ముత్యాలమ్మ, ధర్మల రమేష్, నందూరి హనుమాన్లు, ఎస్.మహంకాళిరావు, కారం భాస్కర్, మడకం సుధారాణి, కె.పోశమ్మ, ఎన్.రమణరావు ఎన్నికయ్యారు.

సిపిఎం జిల్లా రథసారధులు వీరే..



ఎ.రవి



డివిఎన్‌విడి.ప్రసాద్



ఆర్.లింగరాజు



తెల్లం రామకృష్ణ



ఎం.నాగమణి



జి.రాజు



కె.శ్రీనివాస్



పి.రామకృష్ణ

షేక్ సాబ్జీ పోరాట పటిమను ముందుకు తీసుకెళ్లాలి


సంస్మరణ సభలో ఎంఎల్‌సి గోపీమూర్తి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫాఆలీ, రవికుమార్ రుద్రాక్షి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కీర్తిశేషులు షేక్ సాబ్జీ పోరాట పటిమను నాయకత్వం ముందుకు తీసుకెళ్లాలని ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫాఆలీ, రవికుమార్ రుద్రాక్షి అన్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో షేక్ సాబ్జీ ప్రథమ సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాబ్జీ చేసిన కృషిని కొనియాడారు. ఉద్యమంలోనే ఆయన ప్రాణాలు అర్పించారన్నారు. కార్యక్రమానికి జెఎసి ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్ నెర్సు రామారావు, రాష్ట్ర జెఎసి డిప్యూటీ సెక్రటరీ జనరల్ హరినాథ్, సాబ్జీ సతీమణి సుభాన్ బేగం, కుమారుడు ఆజాద్ హాజరయ్యారు.

ఎంఎల్‌సి విజయానికి కృషి చేసిన కార్యకర్తల అభినందన సభ

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా గోపీమూర్తి విజయానికి కృషి చేసిన కార్యకర్తల అభినందన సభ యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రవికుమార్ రుద్రాక్షి, జెఎసి ఛైర్మన్ చోటగిరి శ్రీనివాస్, కన్వీనర్ రామారావు, జెఎసి రాష్ట్ర నాయకులు హరినాథ్ హాజరయ్యారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్‌కు మద్దతు తెలిపిన ఎపిటిఎఫ్-1938, బిటిఎ, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, ఆర్‌టిసి సంఘాల నాయకులు, సిఐటియు సంఘాల నాయకులు, అంగన్వాడీ వర్కర్స్, ఉపాధ్యాయ మిత్రులు, గోపీమూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. గోపీమూర్తి విజయానికి కృషి చేసిన కార్యకర్తలను అభినందించారు.



సంస్మరణ సభలో ఎంఎల్‌సి గోపీమూర్తి, యుటిఎఫ్ నేతలు

జిల్లా కార్యవర్గ సమావేశం

యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ హాజరై జనవరి 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలకు సంబంధించి 20 వేల మందితో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ కార్యక్రమానికి ముఖ్యమంత్రిని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని, అనేక మంది ప్రముఖులను, విద్యావేత్తలను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సభకు వేలాదిమంది ఉపాధ్యాయులు హాజరవ్వాలని పిలుపునిచ్చారు. అలాగే సభలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాలల సమస్యలపై చర్చిస్తారన్నారు. పాత పద్ధతిలోనే పాఠశాలలు కొనసాగాలని, ప్లస్ టు హైస్కూల్‌లో అవసరమైన మేరకు సౌకర్యాలు కల్పించాలని, ఉపాధ్యాయులను కొనసాగించి వారికి ప్రమోషన్, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్తఫా అలీ, రవికుమార్ రుద్రాక్షి, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, ఆడిట్ కమిటీ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సిఎం బందోబస్తు విధులు సమర్థవంతంగా చేపట్టాలి

సిబ్బందికి ఎస్‌పి ప్రతాప్‌శివ కిషోర్

ప్రజాశక్తి - ఏలూరు

సిఎం చంద్రబాబు పోలవరం పర్యటన నేపథ్యంలో బందోబస్తు విధులు సమర్థవంతంగా చేపట్టాలని సిబ్బందిని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా, పొరపాట్లు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే హోంగార్డుల నుంచి ఉన్నతాధికారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ మాట్లాడుతూ బందోబస్తుకు హాజరయ్యే అధికారులకు దిశా దశ, బందోబస్తు సమయంలో నిర్వహించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యమంత్రి జిల్లాకు విచ్చేసింది మొదలు తిరిగి వెళ్లేంతవరకు ఆయా విభాగాల్లో చేపట్టాల్సిన బందోబస్తు కోసం సెక్టార్ల వారీగా విభజించారు. సిఎం భద్రత కోసం రూపొందించిన కార్యాచరణ బందోబస్తు ప్రణాళికను సెక్టార్ల వారీగా రూపొందించి బాధ్యతలు అప్పగించారు. హెలీప్యాడ్, పోలవరం ప్రాజెక్ట్, బహిరంగ సభ వరకు పోలీసులు నిర్వహించాల్సిన విధుల గురించి అధికారులకు దశ దిశ వివరించారు. రోప్ పార్టీలు, రూట్ బందోబస్తు, ట్రాఫిక్ డైవర్షన్, క్లియరెన్స్, పార్కింగ్ ప్రాంతాలు, చెక్ పోస్టులు, తదితర సెక్టార్ల అధికారులకు బందోబస్తు నిర్వహణలో సిబ్బంది చేయాల్సిన పనులు, చేయకూడని పనుల గురించి వివరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి అడ్మిన్ ఎన్.సూర్యచంద్రరావు, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎన్ఎస్ఎస్.శేఖర్, పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్లు మల్లేశ్వరరావు, ఆదిప్రసాద్, ఎఆర్ డిఎస్‌పి చంద్రశేఖర్, ఎఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, పోలవరం ఇన్‌స్పెక్టర్ బాల సురేష్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 5,616 కేసుల పరిష్కారం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఏలూరు వారి ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు జిల్లా వ్యాప్తంగా 33 బెంచీలు ఏర్పాటు చేశారు. వీటిలో ఏలూరులో ఏడు బెంచీలు, భీమవరంలో నాలుగు, కొవ్వూరులో నాలుగు, నరసాపురంలో నాలుగు, తణుకులో నాలుగు, తాడేపల్లిగూడెంలో మూడు, పాలకొల్లులో రెండు, నిడదవోలులో ఒకటి, జంగారెడ్డిగూడెంలో ఒకటి, చింతలపూడిలో ఒకటి, భీమడోలులో ఒకటి చొప్పున ఏర్పాటు చేసినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా కేసులను రాజీ చేసినట్లు, అందులో 5,616 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. వీటిలో 5259 క్రిమినల్ కేసులు, 170 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 187 సివిల్ కేసులను రాజీ చేసినట్లు చెప్పారు. వీటితోపాటుగా 87 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించిన తెలిపారు. వీటిలో ఏలూరులో 1197, భీమవరంలో 601, చింతలపూడిలో 295, జంగారెడ్డిగూడెంలో 526, కొవ్వూరులో 297, నర్సాపురంలో 434, పాలకొల్లులో 213, తాడేపల్లిగూడెంలో 756, తణుకులో 617, నిడదవోలులో 602, భీమడోలులో 78 కేసులు పరిష్కరించామని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, పోలీస్ అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ ప్రతినిధులకు, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్ఎన్ఎల్ వారికి, జిల్లా పంచాయతీ శాఖ వారికి, పత్రిక విలేకరులకు, రవాణాశాఖ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వే శాఖాధికారులకు, అడ్వకేట్ గుమస్తాలకు, అగ్రికల్చరల్ అధికారులకు, మిగతా శాఖలందరికీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.



పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు స్ఫూర్తి

కలెక్టర్ వెట్రి సెల్వి

ప్రజాశక్తి - ఏలూరు


అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం, ఆయన చేసిన పోరాటాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ఆదివారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి కలెక్టర్ వెట్రిసెల్వి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు వంటి మహనీయుని త్యాగాలను స్మరించుకోవల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ దినోత్సవంగా నిర్వహించాలని ఆదేశించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, బిసి సంక్షేమ శాఖ ఇడి ఎన్.పుష్పలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ ఇ.త్రినాథ్ బాబు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ నాగేశ్వరరావు, కలెక్టరేట్ ఎఒ నాంచారయ్య, సెట్ వెల్ సిఇఒ ప్రభాకరరావు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

నేడు సిఎం పోలవరం పర్యటన ఇలా..

ప్రజాశక్తి - ఏలూరు



ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ఈ నెల 16వ తేదీ పోలవరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా సోమవారం ఉదయం 10.45 గంటలకు పోలవరం ప్రాజెక్టు వ్యూపాయింట్ వద్ద ఉన్న హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులను కలిసిన అనంతరం ఉదయం 10.50 గంటలకు హెలీప్యాడ్ నుంచి బయలుదేరి 11.05 గంటలకు పోలవరం ప్రాజెక్టు సైట్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 12.05 గంటల వరకూ ప్రాజెక్టు ప్రాంతంలోని గ్యాప్-1, గ్యాప్-2 వైబ్రో కాంపాక్షన్ పనులను, డివాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తారు. తిరిగి మధ్యాహ్నం 12.20 గంటలకు పోలవరం ప్రాజెక్టు సైట్‌లోని అతిథి గృహానికి చేరుకుని ప్రాజెక్టు పనులపై అధికారులు, నిర్మాణదారులతో సమీక్షిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12.50 గంటలకు పాత్రికేయుల సమావేశంలో పాల్గొంటారు. తిరిగి మధ్యాహ్నం 1.15 గంటలకు అతిథిగృహం నుంచి బయలుదేరి హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం హెలీకాప్టర్‌లో బయలుదేరి రాష్ట్ర సెక్రటేరియట్‌కు వెళతారు.


సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని : మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పోలవరం

ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు పోలవరం ప్రాజెక్టు పరిశీలన ఏర్పాట్లను జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం సాయంత్రం పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్న మంత్రి నిమ్మలకు ప్రాజెక్టు సిఇ నరసింహమూర్తి, మెగా కంపెనీ మేనేజర్ మురళీకృష్ణ, ఇంజినీరింగ్ అధికారులు పూలబొకేలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రాజెక్టు అతిథి గృహంలో జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ఇతర పోలీసు ఉన్నతాధికారులతో బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. ఎలాంటి లోటుపాట్లు రానీయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఏలూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 16వ తేదీన పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలన సందర్భంగా పర్యటన ఏర్పాట్లను ఆదివారం జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పర్యవేక్షించారు. పోలవరం ప్రాజెక్టు వ్యూపాయింట్ వద్ద ఉన్న హెలీప్యాడ్ ఏర్పాట్లు, ప్రాజెక్ట్ పురోగతి పనులు సందర్శించే ప్రాంతాలను, పార్కింగ్, విఐపి గ్యాలరీ, ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించే సమావేశం హాల్, తదితర ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి వారికి కేటాయించిన విధుల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా అధికారులందరూ సమన్వయంతో జాగ్రత్తలు తీసుకొని ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. సమావేశంలో జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ, పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మంత్రి నిమ్మలకు స్వాగతం పలుకుతున్న అధికారులు

గౌతు లచ్చన్న ఆశయాలు, సేవలు ఆదర్శప్రాయం

విగ్రహాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాలు, సేవలు ఆదర్శప్రాయమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. తొలుత ఆయనకు గౌడ సంఘ నాయకులు, యువత ఘన స్వాగతం పలికారు. విగ్రహావిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని తాను ఆవిష్కరించడం గర్వకారణంగా ఉందన్నారు. స్వతంత్రం కోసం పోరాటం చేసిన వారిలో గౌతు లచ్చన్న ఒకరన్నారు. ఆయన ఆశయాలు నేటి తరానికి ఎంతో ఆదర్శమన్నారు. గౌతు లచ్చన్న కుటుంబానికి తమ కుటుంబానికి ఎంతో సన్నిహిత సంబంధం ఉందన్నారు. నిస్వార్థంగా సామాజిక తరగతులకు అతీతంగా సమాజ సేవ చేశారన్నారు. ఎంతో క్రమశిక్షణ కలిగిన గొప్ప నాయకుడన్నారు. ఆనాడు జాతి కోసం, బడుగు బలహీన తరగతుల కోసం ఎన్నో పదవులు వదులుకున్నారన్నారు. గౌతు లచ్చన్న ఒక సామాజిక తరగతికో, ప్రాంతానికో చెందిన వాడు కాదని, అందరి వాడని చెప్పారు. నియోజకవర్గంలో తన గెలుపునకు కారకులైన గౌడ సంఘ సోదరులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. వెనుక బడిన తరగతుల వారు రాజకీయంగా, ఆర్థికంగా, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, అదే గౌతు లచ్చన్నకు ఇచ్చే గౌరవం, ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి ఛైర్మన్ కె.నారాయణ, పలాస ఎంఎల్‌ఎ గౌతు శిరీష, మాజీ మంత్రి జోగి రమేష్, గౌడ సంఘ పెద్దలు పాల్గొన్నారు.




లచ్చన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి

వీడని మబ్బులు.. ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఖరీఫ్ సీజన్ ముగుస్తున్న వాతావరణ మార్పులు రైతులను కలవరానికి గురి చేస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో వరి కోతలు చివరి దశలో ఉండగా వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. ప్రతిరోజు ఆకాశం మేఘావృతమై ఏ క్షణానైనా వర్షం కురిసేలా వాతావరణం మారుతుంది. కారు మబ్బులతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కోతలు పూర్తయిన రైతులు ధాన్యం రాశులను కల్లాలో, రోడ్ల వెంబడి ఆరబెడుతున్నారు. వర్షం కురిస్తే రక్షణకు ధాన్యం రాశుల వద్ద పరదాలను సిద్ధం చేశారు. ప్రతిరోజు కారు మబ్బులు, చల్లని వాతావరణంతో ఎండలు రాక తేమశాతం తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో తేమ శాతం తగ్గించేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వాతావరణ మార్పులతో, భయాందోళనలతో కొందరు రైతులు ధాన్యాన్ని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకున్న వ్యాపారులు 75 కేజీల బస్తాకు రూ.200 తగ్గించి ఇస్తున్నారు. మబ్బుల కారణంగా ధాన్యాన్ని అయినకాడకు దళారులకు అమ్ముకుంటూ గట్టెక్కుతున్నారు. మరికొందరు రైతులు తేమ శాతం తగ్గించేందుకు ధాన్యపు రాశులను ఆరబెడుతూ గిట్టుబాటు ధర పొందే ప్రయత్నం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ వాతావరణంలో వచ్చిన మార్పులతో చేతికి అంది వచ్చిన పంట వర్షం పాలు కాకుండా కాపాడుకునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు.



రోడ్ల వెంబడి ఆరబెట్టిన ధాన్యం

సాగునీటి ఎన్నికల్లో టిడిపి కూటమి విజయ దుందుభి

ఎంఎల్ఎ చిర్రి బాలరాజు హర్షం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో టిడిపి కూటమి విజయ దుందుభి మోగించడంపై ఎంఎల్ఎ చిర్రి బాలరాజు హర్షం వ్యక్తం చేశారు. జీలుగుమిల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు అభినందనలు తెలిపారు. పోలవరం నియోజకవర్గంలో 61 నీటి సంఘాలకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తే అన్నిచోట్ల కూటమి నాయకులు విజయం సాధించి ప్రభంజనం సృష్టించారన్నారు. కూటమి నాయకుల విజయానికి కృషి చేసిన ప్రజలకు, రైతులకు, నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించిన నీటి సంఘాల ఎన్నికలకు ప్రజలు, రైతులు ఏకపక్షంగా కూటమికి అండగా నిలబడ్డారని కొనియాడారు. జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికలకు కృషి చేసిన ట్రై కార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, టిడిపి కూటమి నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

సోమవారం పోలవరం ప్రాజెక్టు సందర్శనకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని కార్యకర్తలకు ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పిలుపునిచ్చారు. పోలవరం నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రికి అందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరనున్నట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు



బాధిత కుటుంబానికి సాయం నేతలు

మెట్టగూడెంలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని చేగొండపల్లి పంచాయతీ మెట్టగూడెంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న జనసేన మండలాధ్యక్షులు గునపర్తి సత్యనారాయణ సంఘటనా ప్రాంతానికి చేరుకుని నిరాశ్రయులైన కలుం సారయ్య కుటుంబాన్ని పరామర్శించారు. సత్యనారాయణ తహశీల్దార్‌తో మాట్లాడి వారికి సాయం అందించాలని కోరారు. తక్షణ సహాయంగా రూ.ఆరు వేలు జనసేన తరఫున బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షులు తెలగారెడ్డి రాంప్రసాద్, కురసం రమేష్, మండల ప్రధాన కార్యదర్శి చీకట్ల సాయిఖర్జున్‌మూర్తి, మల్లిడి సునీల్ కుమార్, కొక్కెర సత్తిబాబు, పాయం వెంకటసాయి, నూనె వెంకటరత్నం, చిప్పాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

210 తెలంగాణ మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జంగారెడ్డిగూడెం డివి జన్ ఎక్సైజ్ సిఐ కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అశ్వారావుపేట నుంచి ఎ.పోలవరం వెళ్తున్న ఆటోను తనిఖీ చేయగా అందులో తెలంగాణ రాష్ట్రానికి చెందిన 210 మద్యం బాటిళ్లను గుర్తించినట్లు సిఐ తెలిపారు. ఆటోను, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.శ్రీనుబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు సుబ్రహ్మణ్యం, వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అనధికారికంగా మద్యం అమ్మకాలు జరిపినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని కొత్తూరుతండ గ్రామంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్ట్ షాపులు నిర్మూలించేవారిపై, నాటు సారా తయారుచేసిన, అమ్ముతున్నవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సారా తయారీకి ఉపయోగించే బెల్లం సరఫరా చేసే వ్యాపారులపై, నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లపు ఊట కలిగి ఉన్న భూ యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. సమాచారం అందించదలిచిన ఎక్సైజ్ ఎస్ఐ 9949539933 అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక లక్ష్మీనారాయణ థియేటర్ సమీపంలో లూన్ (24) అనే యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. మృతుడు నాగాలాండ్‌కి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతుడు రెండేళ్ల క్రితం కోయ ప్రాంతంలోని భారతి అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

పరిస్థితి విషమించి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు నుంచి జారిపడిన వృద్ధుడు గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ తెలిపిన వివరాల ప్రకారం... పెద్ద రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు ఆదివారం రైలు నుంచి జారి పడి గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. వృద్ధుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అదేరోజు సాయంత్రం మృతి చెందాడు. ఈ ఘటనపై రైల్వే ఎస్ఐ సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - కుక్కునూరు

కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి కోడిపుంజులు, కోడికత్తులు, నగదు, సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని వంజంవారిగూడెం గ్రామ శివారులో కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో కోడిపందేలు ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులు, రూ.3,220 నగదు, మూడు సెల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో ప్రజలు జూదానికి దూరంగా ఉండాలని, పేకాట, కోడిపందేలు నిర్వహించినా, పాల్గొన్నా వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. జూదం సరదాగా ప్రారంభమై ఆర్థిక అవసరాలకు ఇబ్బందులు కలగజేస్తున్నాయన్నారు. ప్రతిఒక్కరూ గమనించి కుటుంబాలతో కలిసిమెలసి జీవించాలని, కోడిపందేలు, పేకాటలకు వెళ్లి కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తుందని చెప్పారు. కోడిపందేలు, పేకాట ఎవరైనా నిర్వహిస్తే కుక్కునూరు పోలీస్ స్టేషన్‌కు లేదా 112కు లేదా కుక్కునూరు ఎస్ఐ 7382623699కు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ద్వారకాతిరుమల : మండలంలోని గోపాలపురం గ్రామ శివారులో కోడిపందేల స్థావరంపై ఎస్ఐ టి.సుధీర్ తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో కోడిపందేలు ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.52,080 నగదును, రెండు కోడిపుంజులను, రెండు కోడి కత్తులను, ఐదు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పొట్టి శ్రీరాములు ఆశయాలు ఆదర్శనీయం

వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు


ప్రజాశక్తి - ఏలూరు సిటీ

త్యాగధనుల ఆశయాలు ఆదర్శనీయమని ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. కూటమి ప్రభుత్వం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ దినోత్సవంగా ప్రకటించింది. దీంతో ఆదివారం పొట్టి శ్రీరాములు 72వ ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు వసంతమహల్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ఎంఎల్‌సి గోపీమూర్తి, ఎంఎల్ఎ చంటిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదన్నారు. ఆయన చేసిన త్యాగఫలమే దేశంలో అనేక భాషాప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి బీజం వేసిందన్నారు. త్యాగధనుల ఆశయాలను, ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు గూడవల్లి శ్రీనివాస్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమీపంలోని ప్రముఖ ప్రభుత్వ గురుకుల పాఠశాల వసతి గృహం (హాస్టల్) విద్యార్థులకు పొట్టి శ్రీరాములు జీవిత విశేషాలపై వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు కార్యక్రమం అనంతరం చిన్నారులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విభజించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటి సందీప్ కుమార్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు అమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక జాతీయ రహదారి ప్రధాన కూడలి వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యదర్శి జి.రవికుమార్, పార్టీ మండలాధ్యక్షుడు పి.రాము, ఆర్యవైశ్య సంఘం నాయకులు కె.ఉపేంద్ర, కె.రాము, నాని, రవితేజ, సూరిబాబు, చంద్రరావు పాల్గొన్నారు.

టి.నరసాపురం : అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని టి.నరసాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అద్దంకి గిరికుమార్ అన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయన్నారు. ఆయన ప్రాణత్యాగం వల్లే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, ఆయన త్యాగాన్ని ప్రజలందరూ స్మరించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం మండలాధ్యక్షులు పసుమర్తి రాము, పర్వతనేని మురళీ, అద్దంకి మహేశ్వరరావు, వీరంకి సత్యనారాయణ, కొండపల్లి రవి, పద్మనాభుని ఫణి, నల్లూరి శ్రీను, యలమంచి వాసు, పత్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఏలూరులో....


నూజివీడు టౌన్ : టిడిపి నూజివీడు నియోజకవర్గ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నూజివీడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సిహెచ్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం ఫలితంగానే మనం ప్రత్యేక రాష్ట్రం సంపాదించుకున్నామన్నారు. పొట్టి శ్రీరాములు ఆశయాలు, త్యాగాలు ముందుతరం వారికి తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని ఎల్ఎన్‌డిపేట గ్రామంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి టిడిపి నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు గుబ్బా రాంబాబు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మాతు షణ్ముఖ ఆనందరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుబ్బా రాంబాబు మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల కోసం పోరాడిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని, తుది శ్వాస వరకు ఆంధ్ర జాతి ఐక్యత కోసం పోరాడి అమరజీవిగా చరిత్రకు ఎక్కారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి కొల్లిపర రామబ్రహ్మం, ఎంఎస్ఎస్.వెంకటేశ్వరరావు, సాంబశివరావు, వెంకటరత్నం, నార్కెడిమిల్లి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : పొట్టి శ్రీరాములు ఆదర్శనీయుడని, ఆంధ్రరాష్ట్ర ఆవతరణ కోసం ప్రాణాలర్పించిన మహనీయుడని ఆగిరిపల్లి మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు యండూరు నరసింహ అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆగిరిపల్లి మెయిన్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు కె.ముక్తేశ్వరరావు, వై.ప్రణీత్, టివిఎస్.కిరణ్, సిహెచ్.విజయ్, కె.చైతన్య, ఎం.రిక్విత్ పాల్గొన్నారు.

చింతలపూడి : తెలుగు వారి హృదయాల్లో స్థిరస్థాయిగా నిలిచిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్ పావని అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలర్పించి తెలుగువారి హృదయాల్లో పొట్టి శ్రీరాములు స్థిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ముసునూరు : టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ ముద్రబోయిన వెంకటేశ్వరరావు నూజివీడులోని ఆయన కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్రబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి వేరు చేసి తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలని ఆయన సాగించిన మహత్తర పోరాటం మరువలేనిదన్నారు. త్యాగమూర్తుల జీవితాలను మనం ఆదర్శంగా తీసుకొని వారు చూపిన బాటలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బి.ఎ.సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.



జీలుగుమిల్లిలో...

ద్వారకాతిరుమల : పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ద్వారకాతిరుమల ఆర్యవైశ్య కళ్యాణ మండపం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ బొండాడ రామ్మోహనరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్య్రమంలో పాలక మండల సభ్యులు నార్ల కాశీనాథం, ఉప్పల లక్ష్మణరావు, నల్లమల్లి జగన్నాథరావు, ఇమ్మడి శ్రీనివాసరావు, మానేపల్లి సత్యనారాయణ (బాబ్జి), వెలగ శ్రీరామమూర్తి, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు


ప్రమాదాలబారిన వాహనదారులు పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కుక్కునూరు

రోడ్డుపై ఉన్న కల్వర్టు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు భయాందోలనకు గురవుతున్నారు. నిత్యం ఆ రహదారిపై వందలమంది ప్రయాణిస్తూ ఉంటారు. కనీసం అధికారులు ప్రమాద సూచిక బోర్డు కూడా పెట్టలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కునూరు మండల పరిధిలోని అర్వాపల్లి గిరిజన గ్రామ ప్రధాన రహదారి మార్గంలోని కల్వర్టు సగం కోతకు గురై ప్రమాదకరంగా మారింది. అయినా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవడంలేదని, కనీసం ఎటువంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంలేదని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఆ ప్రదేశంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోతున్నారు. ఆదమరచి ప్రయాణిస్తే ప్రమాదం బారిన పడినట్లేనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అక్కడ పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళలో ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సత్వరమే కల్వర్టు నిర్మించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక గిరిజన రైతులు, వాహనదారులు కోరుతున్నారు.



కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు



జెడ్‌పిటిసి దంపతులకు స్వామివారి ఫొటో అందిస్తున్న సభ్యులు

సుబ్రహ్మణ్యేశ్వర సన్నిధిలో జెడ్‌పిటిసి దంపతులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్ఠి కళ్యాణ మహోత్సవాలు ఆదివారంతో పదో రోజుకు చేరాయి. శని, ఆదివారాలు వరుస సెలవులు కావడంతో యాత్రికులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. యాత్రికులు భారీగా రావటంతో సింగరాయపాలెం సెంటర్ కిటకిటలాడింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకున్నారు. ముదినేపల్లి జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వరరావు దంపతులు పుట్టలో పాలు పోసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి దంపతులకు షష్ఠి ఉత్సవ కమిటీ సభ్యులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి స్వామి వారి ఫొటోను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి, షష్ఠి ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, వి.సురేష్, ఎన్.శివరమేష్, పి.కృష్ణ, బి.సోవమ్మ, కె.సుబ్బలక్ష్మి, డి.నాగలక్ష్మి, బిఎన్‌వి.రాధాకృష్ణ, పి.రమేష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యులు విశేష సేవలందించాలి

ఎంఎల్ఎ బడేటి చంటి, ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు

సరస్వతి హాస్పిటల్ మల్టీ స్పెషాలిటీ, ట్రామాకేర్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజల మన్ననలు పొందే విధంగా వైద్య రంగంలో విశేష సేవలందించాలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు సూచించారు. ఏలూరు ఆర్ఆర్.పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన సరస్వతి హాస్పిటల్ మల్టీ స్పెషాలిటీ, ట్రామాకేర్ సెంటర్‌ను వారు ఆదివారం ప్రారంభించారు. తొలుత వారికి టిడిపి నాయకులు దాకారపు రాజేశ్వరరావు, ఆసుపత్రి వైద్యులు అక్కెం నరేష్, దాకారపు సాయిదీప్తిలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా విస్తరిస్తున్న పరిస్థితుల్లో ప్రతిఒక్కరికీ ఆధునిక వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఇటువంటి అధునాతన ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలందరికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. త్వరలోనే ఈ ఆసుపత్రిలో ఎన్‌టిఆర్ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చేలా చూస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అడిషనల్ ఎస్‌పి డిఎన్.మహేష్, టిడిపి నాయకులు ఆర్ఎన్ఆర్.నాగేశ్వరరావు, రెడ్డి నాగరాజు, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మాజీ సభ్యులు డాక్టర్ దిరిశాల వరప్రసాద్, అక్కెం రితేష్ వెంకట్, పలువురు వైద్యులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ బడేటి చంటి

భీమడోలు రైల్వేస్టేషన్ అభివృద్ధి జరిగేనా..!

ద్వారకాతిరుమల యాత్రికులు, స్థానికుల వేడుకోలు

ప్రజాశక్తి - భీమడోలు

ప్రఖ్యాత పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల వెళ్లేందుకు, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందనున్న కొల్లేరు సరస్సును చేరుకునేందుకు దగ్గర మార్గంగా ఉన్న భీమడోలు రైల్వే స్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని భీమడోలు, దాని పరిసర ప్రాంతాలతో పాటు, ద్వారకాతిరుమలకు నిత్యం వచ్చే వేలాదిమంది యాత్రికులు, సందర్శకులు ఏలూరు ఎంపీ పి.మహేష్‌కుమార్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక ఆదాయపరంగా, సందర్శకుల పరంగా ద్వారకాతిరుమల ఆలయం ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రతి 20 రోజులకు సుమారు రూ.మూడు కోట్ల వరకు యాత్రికుల నుంచి కానుకల రూపంలో వచ్చే ఆదాయం ద్వారకాతిరుమల దేవస్థానం ఖాతాకు జమవుతుంది. కాని భీమడోలు రైల్వే స్టేషన్ పట్ల రైల్వే శాఖ వివక్ష పూనుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి ఉదాహరణగా భీమడోలు రైల్వేస్టేషన్లో అన్నవరం తరహాలో రైళ్లు ఆగటం లేదన్న విషయాన్ని పేర్కొనవచ్చు. యాత్రికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లకు భీమడోలులో హాల్ట్ కల్పించడంతో పాటు, భీమడోలు రైల్వేస్టేషన్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలని యాత్రికులు కోరుతున్నారు. వాస్తవానికి భీమడోలు రైల్వేస్టేషన్‌లో ద్వారకాతిరుమలకు వెళ్లే యాత్రికుల సౌలభ్యం కోసం స్టేషన్లో ప్రత్యేక సూచిక బోర్డులు అప్పటి బ్రిటిష్ ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. గతంలో అప్పటి ఎంపీ మాగంటి బాబు కృషి ఫలితంగా భీమడోలు రైల్వేస్టేషన్‌లో సింహాద్రి, తిరుమల రైళ్లకు హాల్ట్ ఇచ్చారు. ఈ జాబితాలో తాజాగా రాయగడ ఎక్స్‌ప్రెస్ చేరింది. కరోనా నేపథ్యంలో విశేష ఆదరణ పొందిన అప్పటి కాకినాడ-తిరుపతి పాసింజర్ (ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌గా మారింది) భీమడోలు హాల్టును రద్దు చేశారు. తిరిగి పునరుద్ధరించలేదు. దీంతో ద్వారకాతిరుమల సందర్శించుకున్న యాత్రికులు నేరుగా తిరుమల తిరుపతికి వెళ్లేందుకు రైలు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఉండే రైల్వే రిజర్వేషన్ సౌకర్యాన్ని రద్దు చేశారు. భీమడోలు స్టేషన్లో ఆగే రైళ్ల సంఖ్య తగ్గటంతో భీమడోలు రైల్వే స్టేషన్ నుంచి యాత్రికులను ద్వారకాతిరుమల తీసుకెళ్లేందుకు ఆర్‌టిసి యాజమాన్యం ఏర్పాటుచేసిన బస్సు సౌకర్యాలు రద్దు చేశారు. ద్వారకాతిరుమల వెళ్లే యాత్రికుల కోసం ద్వారకాతిరుమలకు రోడ్డు మార్గాన సుమారు 40 కిలోమీటర్లు, భీమడోలు రైల్వే స్టేషన్‌కు సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న చేబ్రోలు రైల్వేస్టేషన్‌లో వివిధ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ సౌకర్యం కల్పించడంతో పాటు, స్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎంపీ మహేష్‌కుమార్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరినట్లు ఎంపీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. దీంతో భీమడోలు రైల్వేస్టేషన్ అభివృద్ధి ఇక అటక ఎక్కినట్టేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ద్వారకాతిరుమలకు వచ్చే యాత్రికులతో పాటు, స్థానికుల కోరిక మేరకు ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్ భీమడోలు రైల్వే స్టేషన్‌లో ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు పలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ల హాల్ట్ కల్పించాలని కోరుతున్నారు. రిజర్వేషన్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయడంతో పాటు, ట్రైన్ కోచ్ స్థానాలు తెలియజేసే సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వారు అభ్యర్థిస్తున్నారు.



రైల్వేస్టేషన్‌లో ద్వారకాతిరుమల వెళ్లాలని ఏర్పాటుచేసిన సూచిక బోర్డు



భీమడోలు రైల్వే స్టేషన్

17న ఏలూరులో జాబ్‌మేళా

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు ప్రభుత్వ డిఎల్‌డిసి/ ఐటిఐ కళాశాల (స్కిల్ హబ్)లో ఈ నెల 17వ తేదీ మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లురాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.జితేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ ఫెయిర్‌లో అపోలో ఫార్మసీ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్, కొల్గేట్ పల్మలివ్, ఎన్ఎస్ ఇన్స్ట్రుమెంట్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్, శ్రీ లక్ష్మీకృష్ణ, సుజుకి మోటార్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. సుమారు 240 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, (డి/బి/ఎమ్) ఫార్మసీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18 నుంచి 45 వయసు గల వారు అర్హులని తెలిపారు. ఈ జాబ్ మేళాకు తమ బయడేటా, సర్టిఫికెట్స్ నకళ్లతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9493482414, 8919608183ను (9988853335 - టోల్ ఫ్రీ) సంప్రదించాలని తెలిపారు.

20న నూజివీడులో..

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నూజివీడులో మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సూచన మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే దిశగా భారీ జాబ్‌మేళాకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నెల 20వ తేదీన నూజివీడులోని త్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్ ఆడిటోరియంలో ఈ మేళాను నిర్వహిస్తారు. దాదాపు 40 కంపెనీలు వేర్వేరు ఉద్యోగ అర్హతలు ఉన్న యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్నాయి. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లమో, బిటెక్, బి.ఫార్మసీ, డిగ్రీలు పూర్తి చేసిన వారికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, చెన్నైలలో ఉన్న అనేక సంస్థలు ఉద్యోగ అవకాశాలు కల్పించబోతున్నాయి. జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఊటుకూరులో కొనసాగుతున్న పోలీస్ పికెట్

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని ఊటుకూరులో పోలీస్ పికెట్ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ ఏడాది సెప్టెంబర్ ఏడో తేదీన గ్రామంలో పోసిన బాలకోటయ్య అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన వ్యక్తులు పాత కక్షల నేపథ్యంలో దారి కాచి హత్య చేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్పట్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈ కేసులో అరెస్ట్ అయిన నిందితులను మచిలీపట్నం సబ్‌జైలు రిమాండ్‌కు పంపారు. నెలరోజుల అనంతరం ఇటీవల ప్రధాన నిందితుడు గూడపాటి శ్రీనుబాబుకు మినహా మిగిలిన నలుగురికి బెయిల్ వచ్చింది. నిందితుల్లో కొందరు వ్యక్తులు హతుడి కుటుంబానికి బంధువులు కావడంతో ముందు జాగ్రత్త చర్యలో భాగంగా ఊటుకూరులో పోలీస్ పికెట్ ఇంకా కొనసాగిస్తున్నారు.

మహాగర్జనకు తరలిన మాలలు

ప్రజాశక్తి - పోలవరం

హలో మాల- చలో గుంటూరు పిలుపుతో గుంటూరులో జరుగుతున్న మాలల మహాగర్జనకు రాష్ట్ర మాల మహానాడు కార్యదర్శి సొబ్బన మోహన్ ఆధ్వర్యంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా సొబ్బన్న మోహన్ మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో దళితులను రాజ్యాధికారానికి దూరం చేస్తున్న కుట్రగా అభివర్ణించారు. వర్గీకరణ వ్యతిరేకంగా చేపట్టే ఉద్యమానికి ప్రతి కుటుంబం సంఘీభావం తెలిపి ఈ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దళితులను విడదీయడం ద్వారా సామాజికంగా, ఆర్థికంగా పరిపాలనలో భాగస్వామ్యం కాకుండా చేస్తున్నారన్నారు. గుంటూరులో జరుగుతున్న మాల మహాగర్జన ద్వారా తమ సత్తా ఏంటో ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు కార్యకర్తలు బచ్చల వెంకటరమణ, పల్లి నాగేశ్వరరావు, కొండే ఏసు, జాలె పోసి, పల్లి నాగేశ్వరరావు, కట్టూరి ఏబేలు, బొద్దెల రాజేష్, ముప్పర్తి దాసు, మాల మహానాడు కార్యకర్తలు తరలివెళ్లారు.

చింతలపూడి : హలో మాల - చలో గుంటూరు కార్యక్రమానికి చింతలపూడి మండలం నుంచి వేలాదిగా తరలివెళ్లారు. వర్గీకరణ వద్దు ఐక్యత ముద్దు అని నినదించారు. రాజ్యాంగ విరుద్ధంగా వర్గీకరణ చేసిన ప్రభుత్వానికి మాలల బలం చూపించటానికి వెళ్తున్నట్లు మాలల జెఎసి నాయకులు తెలిపారు. ఇప్పటివరకు కలిసిమెలిసి ఉంటున్న మాల, మాదిగ సామాజిక తరగతులను రాజకీయాల కోసం విడతీసి చిచ్చు పెట్టే నాయకుల మెడలు వంచడానికి మాలలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ముదినేపల్లి : అఖిల భారత మాల సంఘాల జెఎసి ఇచ్చిన పిలుపు మేరకు హలో మాల- చలో గుంటూరు కార్యక్రమానికి ముదినేపల్లి మండలం నుంచి ఆదివారం పెద్దఎత్తున మాలలు తరలివెళ్లారు. ఎస్‌సి వర్గీకరణ వద్దంటూ క్రిమీలేయర్ విధానాన్ని వ్యతిరేకిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాజ్యాంగ వ్యతిరేక కార్యక్రమాలను నిలుపుదల చేయాలంటూ పిలుపునిస్తూ కదిలారు. బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి నేతలు పూలమాల వేసి కారు, టాటా మ్యాజిక్ వాహనాల్లో వీధుల్లో ర్యాలీ నిర్వహించి గుంటూరు తరలి వెళ్లారు. మాల మహానాడు నాయకులు భూపతి రవీంద్ర, ముత్యాల శ్రీనివాసరావు, పంతగాని సురేష్, పాగొల్లు విజయసాగర్, కోటే ప్రవీణ్, గూడపాటి వరప్రసాద్, తదితరులు గుంటూరు తరలివెళ్లారు.